క్లుప్తంగా

సీఈకి శుభాకాంక్షలు


ప్రభాకర్‌రావుకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

పాల్వంచ: నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ 5, 6 దశల ఆధ్వర్యంలో చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్‌రావుకు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ.. ఉద్యోగులంతా కష్టపడి పనిచేసి 5, 6 దశలను జెన్‌కోలో అగ్రభాగాన నిలపాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ బ్రాంచ్ సెక్రటరీ డి.ఉమామహేశ్వరరావు, చంద్ర కళాధర్, శ్రీనివాసరావు, రాజబాబు, పావని, ప్రదీప్, దివాకర్, మధుసూదన్, రామారావు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయమూర్తికి..

కొత్తగూడెంఅర్బన్: జిల్లా న్యాయస్థాన లైబ్రరీ మీటింగ్ హాల్‌లో బుధవారం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్‌ను, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, న్యాయవాది యర్రా కామేష్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, న్యాయవాదులు పలివెల సాంబశివరావు, అంబటి రమేష్, వడ్లకొండ హరి, ఏండీ.సాధిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి


స్వెటర్లు అందజేస్తున్న ఎంఈఓ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థులు కష్టపడి చదువుకుని లక్ష్యాలను చేరుకోవాలని ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాళ్ సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలలో పాక్షిక అనాథ, ఆసరా లేని విద్యార్థులు పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిలో చదువుతున్నారు. పాఠశాలపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యార్థులకు అన్నీ సమకూర్చుతున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు స్వెటర్లు, నూతన దుస్తులను అందజేశారు. విద్యార్థులను శ్రద్ధగా గమనించాలని పాఠశాల నిర్వాహకులకు సూచించారు.


ఉత్సాహాన్ని పెంచడానికే ప్రోత్సాహం..

సింగరేణి(కొత్తగూడెం): ఉత్సాహాన్ని పెంచడానికి ప్రోత్సాహం మంచి టానిక్ అని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ అన్నారు. బుధవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని సింగరేణి పాఠశాలలో వంటలు చేసే మహిళలకు (మిడ్ డే మీల్స్ వర్కర్లు) చీరలు పంపిణీ చేసి, వారిని ఘనంగా సత్కరించారు. సెక్రటరీ మాట్లాడుతూ.. మహిళలు తమ వంతు విధిగా కింది స్థాయి ఉద్యోగులం అనే భావం లేకుండా విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం వడ్డిస్తున్నారని, వారి శ్రమను గుర్తించటం విభాగం హెచ్‌ఓడీగా తన బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సాయి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

టేకులపల్లి: నూతన సంవత్సరం సందర్భంగా పోలీసులు పలు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో టేకులపల్లిలో సీఐ టి.సురేష్, ఎస్ఐలు పి.సురేష్, పి.శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ప్రధాన సెంటర్ల వద్ద వాహన తనిఖీలు చేపట్టి, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.

మాజీ కమిషనర్ మృతి


రాజేశ్వరరావు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నోటిఫైడ్ ఏరియా కమిషనర్‌గా 1991–92లో పని చేసిన ఎం.రాజేశ్వరరావు బుధవారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మరణించారు. అంత్యక్రియలు గురువారం జరుగనున్నాయని కుటుంబ సభ్యులు వివరించారు. కమిషనర్‌గా కొత్తగూడెం పట్టణ అభివృద్ధికి ఎంతో కృషి చేసి, సిమెంట్ రోడ్లు, టాయిలెట్స్, డ్రెయినేజీని ఎంతో మెరుగుపర్చారు. ప్రజానాట్యమండలి సహకారంతో అక్షరదీపం కార్యక్రమాన్ని తండాలలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మృతి పట్ల కొత్తగూడెంలోని కోటేశ్వరరావు, కనకరాజు, అడ్వకేట్ రమేష్‌కుమార్ మక్కడ్, బీఎస్ఎన్ఎల్ రామచందర్‌రావు, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జునుమల రమేష్, పట్టణ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు

- ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు
- కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్న యువత
- ఆలయాలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కొత్తగూడెంటౌన్: 2024 ఏడాదికి గుడ్ బై చెబుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రజలు మంగళవారం డిసెంబర్ 31 అర్ధరాత్రి నుంచి జనవరి 1 వరకు కొత్త సంవత్సరం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులను తీర్చిదిద్దారు. ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో బంధువులు, మిత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో భక్తులు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. కొత్తగూడెం జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ కేక్ కట్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, న్యాయమూర్తులు న్యాయవాదులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పాఠశాలల్లో, పారిశుద్ధ్య కార్మికులు, ఫుడ్‌కోర్ట్ దుకాణదారులు, కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించుకొని నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్‌బండారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: నూతన సంవత్సరం సందర్భంగా పలు సంఘాల ఆధ్వర్యంలో క్యాలెండర్లు ఆవిష్కరించారు. పాత పాల్వంచ నందు రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ఇంటి వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, ధర్మరాజుల నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు..

న్యూ ఇయర్ సందర్భంగా పలు చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు చేశారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, న్యూ ఇయర్ కేక్ కటింగ్, క్యాలెండర్ల ఆవిష్కరణ, నృత్యాలు, దుస్తుల పంపిణీ చేశారు.

జూలూరుపాడు: ప్రజలు నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. యువతీ, యువకులు, మహిళలు, పిల్లలు అన్నివర్గాల ప్రజలు గత ఏడాదికి వీడ్కోలు పలికి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మంగళవారం రాత్రి యువత వీధుల్లో బాణసంచా కాల్చి, నృత్యాలు చేస్తూ కేక్ కట్ చేసి కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికారు. న్యూ ఇయర్ 2025కు స్వాగతం పలుకుతూ వాకిళ్లలో ముగ్గులతో తీర్చిదిద్దారు. ప్రజలు ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రైస్తవులు ఆయా గ్రామాలలో చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెంలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు, యువతులు

ఫాదర్, పాస్టర్లు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి పాపకొల్లు శ్రీ ఉమాసోలింగేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్వీ రెడ్డి యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఇయర్ వేడుకల్లో ఆయన పాల్గొని, కేక్ కట్ చేశారు. వెంగన్నపాలెం కల్వరి ఆదరణ మినిస్ట్రీస్ చర్చి, కొత్తూరు గ్రామ పంచాయతీ పెద్దహరిజనవాడ చర్చిలో వేడుకలకు ఆయన హాజరై కేక్ కట్ చేసి, న్యూ ఇయర్ క్యాలెండర్లను ఆవిష్కరించారు.

ఇల్లెందు: ఇల్లెందులో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్యకు సింగరేణి ఏరియా జీఎం వీసం కృష్ణయ్య, డీఎస్పీ ఎస్.చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ, కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావలీలు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఇల్లెందు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ చంద్రభానుకి సబ్ డివిజన్ పోలీసులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి జీఎం వీసం కృష్ణయ్య పలువురు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఇల్లెందు కోర్టులో న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు దొడ్డా డానియేల్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మడత రమ – వెంకట్‌గౌడ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్యలను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇల్లెందురూరల్: నూతన సంవత్సర వేడుకలను మండలంలోని పలు గ్రామాలలో ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఉత్సవాల్లో నిమగ్నమయ్యారు. నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. అన్ని మతాలకు చెందిన ప్రజలు ఆలయాలు, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు రాత్రి దైవ ప్రార్థనలతో గడిపారు. మహిళలు అర్ధరాత్రి నుంచే నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఇళ్ల ఎదుట అందంగా రంగులతో ముగ్గులు వేశారు.

టేకులపల్లి: 2024కి వీడ్కోలు చెప్పి కొత్త సంవత్సరం 2025కి స్వాగతం పలుకుతూ టేకులపల్లి మండలంలో మంగళ, బుధవారాలు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ముగ్గులు వేశారు. స్వీట్లు, కేక్‌లు, బిర్యానీ పాయింట్లలో రెండు రోజులూ కొనుగోళ్లతో సందడి నెలకొంది. చర్చిల్లోనూ నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. టేకులపల్లి పెంతెకొస్తు చర్చిలో నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు.


ఇల్లెందు: మంత్రి పొంగులేటికి శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే కనకయ్య, మువ్వా విజయబాబు, తుళ్లూరి బ్రహ్మయ్య


ఏక్తా భవన్‌లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం


సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు


ఇల్లెందురూరల్: విజయలక్ష్మీనగర్‌లో...


కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో కేక్ కట్ చేస్తున్న జడ్జి పాటిల్ వసంత్


రామవరం పంజాబ్‌గడ్డ బస్తీలో..


జూలూరుపాడు: వెంగన్నపాలెం హోలీ ఫెయిత్ మినిస్ట్రీస్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం


కల్వరి ఆదరణ మినిస్ట్రీస్ చర్చిలో ప్రార్థనలు


పాల్వంచ: కేక్ కట్ చేస్తున్న కొత్వాల శ్రీనివాసరావు


ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న వనమా వెంకటేశ్వరరావు


కొత్తగూడెంఅర్బన్: శ్రీరాగా పాఠశాలలో..


పారిశుద్ధ్య కార్మికులకు కేక్ తినిపిస్తున్న దృశ్యం


సాయిరాంతండా చర్చిలో..


టేకులపల్లిలో వేస్తున్న ముగ్గులు యువతులు


సులానగర్ ఆర్‌సీఎం చర్చిలో...


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


టేకులపల్లిలో కేకుల కొనుగోలు సందడి

ఆర్టీసీలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు


మాట్లాడుతున్న ఎస్ఐ రాకేష్

చుంచుపల్లి: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కొత్తగూడెం ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కొత్తగూడెం టౌన్ ఎస్ఐ రాకేష్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) భవాని ప్రసాద్ రోడ్డు భద్రత ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ప్రమాదాల నివారణకు ప్రతీఒక్కరు నిబంధనలు పాటించాలని సూచించారు. నెలరోజులు జిల్లాలో రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని, ఫోన్ మాట్లాడుతే, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. ఆటోలు, జీపులు, ఇతర ప్రైవేటు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడుదాం..


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాల సవరణ వల్ల కార్మికులు తమ హక్కులను కోల్పోతున్నారని, కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్.ఉపేందర్‌రావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు గౌని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక ఇష్టూ భవన నిర్మాణ కార్మిక సంఘం పాల్వంచ ఏరియా కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... దేశంలో నూతన చట్టాల సవరణల పేరుతో కార్మికులు సాధించుకున్న హక్కులను కాలరాస్తూ ప్రశ్నించే గొంతులను నిర్బంధిస్తున్నారని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రం శ్రీను, మంకెన వెంకటేశ్వర్లు, కొప్పుల నరసింహారావు, నిమ్మల భాస్కర్, మల్లేష్, రాజేష్, కృష్ణ, రమేష్, అఫ్జల్‌ఖాన్, వెంకన్న, వెంకటేశ్వర్లు, వినోద్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి


టెలిఫోన్ డైరెక్టరీని ఆవిష్కరిస్తున్న కీర్తిచంద్రికారెడ్డి

ఇల్లెందు: నోటరీ న్యాయవాది దంతాల ఆనంద్ రూపొందించిన టెలిఫోన్ డైరెక్టరీ వల్ల ఎంతో ఉపయోగం ఉందని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తిచంద్రికారెడ్డి అన్నారు. బుధవారం కోర్టు హాల్‌లో ఆ టెలిఫోన్ డైరెక్టరీని ఆమె ఆవిష్కరించి, పట్టణ ప్రజలకు, న్యాయవాదులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాట్లాడుతూ.. న్యాయవాదులు సేవా రంగంలో ముందుండాలని, ప్రజల కోసం మరిన్ని సేవలు అందించాలని కోరారు. టెలిఫోన్ డైరెక్టరీ ప్రజలకు న్యాయవాదులకు, పోలీసులకు, ఇతర అధికారులకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఇందిర, ఎస్.మల్లికార్జున్‌రావు, పెద్దూరి నర్సయ్య, ఉమామహేశ్వరరావు, కె.సుధాకర్, సుడిగాలి వెంకటనర్సయ్య, మామిడి సత్యప్రకాష్, మహేష్, పి.బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గడువు పొడిగించండి..

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని పొడిగించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకుబ్‌పాషా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతీ ఏడాది ఉపకార వేతనాల కొరకు సుమారు 12.5 లక్షల విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటారని, 2024–25లో ఫ్రెషర్స్, రెన్యువల్ కలుపుకుని మొత్తం 7.75 లక్షల మంది విద్యార్థులు మాత్రమే ఉపకారవేతనాల కొరకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం గడువు తేదీని పొడగించకపోతే సుమారు 4 లక్షల మంది విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపకార వేతనాల గడువును తేదీని పొడిగించాలని కోరారు.

దాడిని ఖండించండి..


మాట్లాడుతున్న మధు

ఇల్లెందు: హైదరాబాద్‌లో జరిగిన బుక్ ఫెయిర్‌లో వీక్షణం బుక్ స్టాల్ మీద ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు దౌర్జన్యం చేసి ప్రముఖ రచయిత వీక్షణం ఎడిటర్ ఎస్.వేణుగోపాల్ మీద దాడి చేయటాన్ని ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు తీవ్రంగా ఖండించారు. బుధవారం ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో మతోన్మాదం జడలు విప్పిందన్నారు. మోదీ అనుచరులు ప్రజలు, ప్రజాస్వామిక వాదుల మీద దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల స్వేచ్ఛను హరిస్తున్నారని తెలిపారు. హిందూ మతోన్మాదం పెరిగిపోవటానికి మోదీ అమిత్‌షాలు అనుసరిస్తున్న విధానాలే కారణం అన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేయటమే ఇందుకు ఉదాహరణగా చెప్పారు. ఈ కార్యక్రమంలో సీతారామయ్య, గౌని నాగేశ్వరరావు, తుపాకుల నాగేశ్వరరావు, పాడుగు నర్సింహారావు, కె.సారంగపాణి, మోకాళ్ల రమేష్, తోడేటి నాగేశ్వరరావు, సూర్ణపాక నాగేశ్వరరావు, గూళ్ల సదయ్య, చారీ, లాలు, శ్రీను, మోతీలాల్, ఉపేందర్‌రావు, నర్సింహారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి


కార్తీక్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: యువజన కాంగ్రెస్ విభాగాన్ని జిల్లాలో మరింత పటిష్టం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి అన్నారు. బుధవారం కొత్తగూడెం పట్టణంలోని ఆళ్లమురళి రైస్ మిల్లులో భద్రాద్రి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన చీకటి కార్తీక్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో యువజన విభాగానికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర త్రివేది, కేకే శ్రీను, బాలిశెట్టి సుందర్‌రాజు, మసూద్, సుందర్‌లాల్ కోరి, చింతలపుడి రాజశేఖర్, బాలపాసి, వాణిరెడ్డి, సత్తిరెడ్డి, వెంకటేశ్వర్లు, సాయి, కూరపటి రాజేష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర సాధనలో ఉద్యమకారులది కీలకపాత్ర


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారులది కీలకపాత్ర అని తెలంగాణ జన సమితి పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ గోపగాని శంకర్‌రావు అన్నారు. బుధవారం జూలూరుపాడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడినట్లు చెప్పారు. ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో జేఏసీని ఏర్పాటు చేసి ఉద్యోగులు, నిరుద్యోగులు, మేధావులు, విద్యార్థులు, వివిధ కులసంఘాలతో తెలంగాణ ఉద్యమ కొనసాగిందన్నారు. ప్రొఫెసర్ కోదండరాం పర్యవేక్షణలో సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, సాగరహారం నిర్వహించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ప్రజల గళాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిందన్నారు. 3న పాల్వంచలో జరగనున్న తెలంగాణ జనసమితి పార్టీ ప్లీనరీ సమావేశానికి మేధావులు, విద్యార్థులు, ఉద్యమకారులు, అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీజేఎస్ వైరా నియోజకవర్గ కోఆర్డినేటర్ బట్టు రాజేందర్, జూలూరుపాడు, రఘునాథపాలెం మండలాల కోఆర్డినేటర్లు రాచబంటి వెంకటనర్సయ్య, ఉన్నం సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పేరు మారింది..



గతంలో ఏపీజీవీబీ బోర్డు



కొత్తగా ఏర్పాటు చేసిన టీజీబీ బోర్డు

ఇప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) పేరుతో కొనసాగిన గ్రామీణ బ్యాంక్ ఇకపై తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ)గా అందుబాటులోకి వచ్చింది. నాలుగు రోజుల విరామం అనంతరం బుధవారం నుంచి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో భాగంగా సుజాతనగర్ మండల కేంద్రంలో ఉన్న బ్యాంకు పేరును టీజీబీగా మార్చారు. కొత్తగా ఏర్పాటు చేసిన లోగోలో 'గ్రామీణాభి వృద్ధే లక్ష్యం' అని వరికంకులను ఏర్పాటు చేశారు. – సుజాతనగర్